జ్యోతి కథల పోటీలో ప్రత్యేక ప్రశంసపొందిన కథ!

పలుపు

సదానంద శారద

"కొత్తదొర శానా మంచోడె" — అన్నాడు భార్యతో అయిలయ్య.

ఆ మాటలు విని దుర్గమ్మ నవ్వసాగింది.

"ఏంటిదె!—దొర మంచోడంటే నవ్వుతా నవు. దొరల్ల మంచోళ్ళుండరా?" కొంచెం కోపం వచ్చింది అయిలయ్యకు.

"అదికాదయ్యా. వచ్చి రొండురోజులు కాలె అప్పుడే దొర మంచోడో, సెడ్డోడో తెల్సిపోయినాది?" అంది దుర్గమ్మ.

"నీదంతా చోద్యం ఒక్కపారి సూత్తె ఎఱుకగాదె మంచీ, సెడ్డ?"

"అట్లనా! ఏదిసెప్పు దొరల ఏంజూసి మంచోడు అంటనవో?"

"నవ్వుకుంటు మాట్లాడుతడే దొరలు తిట్టుకుంట మాట్లాడుతరుగాని నవ్వుకుంటూ మాట్లాడుతారె?"

"ఉహూఁ"

"ఒక్కడే రాలె అమ్మగోరినిగూడ ఎంట బెట్టుకొచ్చుకున్నడు"

"పెళ్ళాన్నిఎంటబెట్టుకచ్చుడుగూడాగొప్పే"

"అదికాదే మునుపచ్చిన దొరలు ముందు గాల్నె అమ్మగోర్లతో రాకపోయేదె అసోంటిది ఈదొర పొట్టలోనున్నా అమ్మగోరిని తీసుకొచ్చుకున్నడు—"

"ఉఁఉఁ తీసుకొత్తనె వత్తాది!- ఆమే దొర ఎంబడి పడి వచ్చిందొచ్చు... సూపులుపక్కకు పోతె సురుకలంటించడాన్కి"

భార్య అలా అనడం అయిలయ్యకు రుచించలేదు—

"సాల్లే. ఇంత కూడెయ్యి, జల్దినబోవాలె" అన్నాడు.

"సంటిదానికి పాలిత్తాన కనబడ్తలేదు జర ఆగరాదు?"

"పోవాల్నె సరె నేనేసుకుంట కూకో" అంటూ అరుగుమీదినుంచి ఇంట్లోకి వెళ్ళాడు అయిలయ్య.

"కడుపునిండా తినిపో. ఆయిల్లగూడ తినలే" అంది దుర్గమ్మ పాలు తాగుతున్న సంటిదాన్ని ప్రేమగా నిమురుతూ—

కంచం కడుక్కొని అన్నం వేసుకొని కూర్చున్నాడోలేదో "దొర రమ్మంటాండు" అంటూ వచ్చాడు కనకయ్య.

దుర్గమ్మ కొంగుతోటి [illegible] కప్పుకొంది. పాలు తాగుతూన్న పసిపి సగం బయట సగం కొంగులోపల ఉండిపోయింది.

కనకయ్యకు పిల్లలులేరు. గేదెలున్నాయి. కనకయ్య తనభార్య పాలిస్తుండగా యెప్పుడూ చూడలేదు. గేదెలు పాలిస్తుండగా మాత్రం రోజూ చూస్తాడు — దుర్గమ్మ పాలిస్తుండగా చూస్తున్నాడు — తినబోతున్నవాడల్లా అన్నం మీదినుంచి లేచివచ్చాడు అయిలయ్య.

"అయ్యో! కూడుతిని పో. అట్లనేపోతావా ఏంది?" భుజంమీద కండువా వేసుకుని భర్త బయిటికి రావడంచూసి అంది దుర్గమ్మ.

"ఆ టెంక తింటలేయె. దొర పిలుత్తాండట— ఎందుకో పోయత్త" అంటూ "ఆయిల్లతిండ్లె

ఇప్పుడుగూడ తినకుండపోతె ఎట్లనయ్యా...." అని దుర్గమ్మ అంటున్నా వినిపించుకోకుండా గబగబా వెళ్ళిపోయాడు అయిలయ్య.

అది వరంగల్ జిల్లాలోని ఒక పంచాయితీ.

ఆ సంవత్సరంలో అప్పటికే యిద్దరు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఆ ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ అయి, ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్ళిపోయారు. కృష్ణమూర్తి మూడో ఆఫీసరు—

అది మారుమూల పంచాయతీ కావటం వలన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లెవరికీ ఆ పంచాయితీకి రావటానికి యిష్టం వుండదు.

అందుకే తమకు ఇష్టం లేనివారిని ఆ పంచాయితీకి పంపుతుంటారు పై అధికార్లు-రాగానే ప్రతి ఆఫీసరుచేసే మొదటిపని తనకు అక్కణ్నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవడానికి ప్రయత్నించడం—ఈ పంచాయితీలతో ఇదే పంచాయితి!....ప్రతి ఆఫీసరు, టీచరూ టిక్ టొంటీ తాగిన మొహాలు పెట్టుకొని ఊసురోమంటూ కన్పిస్తారు—వాళ్ళకెప్పుడూ ట్రాన్స్‌ఫర్ గోడవలే!

పంచాయితీ ఆఫీసు వెనకనున్న డాబా ఇల్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుకోసం కేటాయించబడింది.

ఆరోజు ఆదివారం—

ఆఫీసుకు మాత్రమే శెలవు. ఆఫీసుప్యూన్ అయిలయ్యకు శెలవుండదు — అయిలయ్య తాలూకాఫీసు జీపులాంటివాడు. ప్రతి రోజూ పనిచేయాలి.

ఆఫీసు పనిచేయాలి—ఆఫీసరు ఇంటి పని చేయాలి.

ఆఫీసరును మోయాలి—ఆఫీసరు యింటిని మోయాలి.

ఆఫీసరుగారి ఇంటిముందు ప్యూను నిలుచున్నాడు. ఆరోజు ఆదివారం .... కృష్ణమూర్తి క్వార్టర్ ముందు అయిలయ్య నిలుచున్నాడు. తాలూకాఫీసునుండి తెప్పించిన జీపుకూడా నిలుచుంది.

కనకయ్య వెళ్ళిపోయాడు. ఆఫీసరు ఇంటి వెనకాల పెరటిలోనేవుంది కనకయ్య గుడిసె. కనకయ్య పంచాయతీ ఆఫీసుకు, ఆఫీసర్

రచయిత గురించి

ఈ పేరులోని అర్థభాగం అర్థభాగం పేరు కలవనివ్వని వారితో,వాటితో పోరా ....ప్రస్తుతం ఉంటున్నది బ్రతుకుతెరువు కోసం పోరాడుతూ హైద్రాబాద్‌లో-తొలిసారిగా ఊపిరి పీల్చింది స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు సంవత్సరాలకు వరంగల్‌లో.

ఇప్పుడిప్పుడే సాహితీ లోకంలో అడుగుపెడుతున్నాను. 'పలుపు' కథకు ప్రత్యేక బహుమతి నిచ్చి ప్రోత్సహించిన 'జ్యోతి'కి కృతజ్ఞతలు. ఇది అచ్చయిన మా ఎనిమిదవ కథ. బహుమతి గెలుచుకున్న రెండవ కథ. ఒక ప్రముఖ వార పత్రికలో 'హేమ' అనే నవల సీరియల్‌గా రాబోతున్నది.

ఈ సశేష రచనలోని అందాలను ఆనందించకలిగించేలా, ఆవేదనలను కదిలించేలా చెప్పగలిగితే ఈ గ్రంథంలోని ఒక పుటలో మా పాత్ర అభినయం పూర్తవుతుంది.

—సదానంద్ శారద

ఇంటికి చౌకీదారు-అంటె ఆఫీసుకు, క్వార్టర్‌కు ముందునుంచి కనకయ్య వెనుకనుంచి గుడిసె కాపలా దారులు—

సుష్టుగా భోంచేసి బయటకు వచ్చాడు కృష్ణమూర్తి.

"వచ్చినవా అయిలయ్యా — మనం తొంద రగా వరంగల్ పోవాలె—అమ్మగారి అమ్మ గారింటికి—జీపు తెప్పించిన" అన్నాడు.

"అట్లనే బాంచెను—" అమ్మగారి అమ్మ గారింటికి అంటే దొరగారి అత్తగారింటికి దొరగారు పోతున్నారు సరే—సంతోషం!- మరి అయిలయ్య ఎందుకు? — ఎందుకంటె దొరగారి బొచ్చుకుక్క కూడా పోతాలేదు ! అత్తగారింటికి అట్టహాసంగా పోవద్దూ! "దొర గోరు శానా మంచోరు—అత్తగారింటికి గూడ నన్ను తీసుకపోతాండు—" మరోసారి దొర గారి మంచితనం కనిపించింది అయిలయ్యకు.

బొచ్చుకుక్కకూ కడుపునిండా తినిపించి అమ్మగారు వచ్చారు. అమ్మగారు, దొరగారు జీపులో ముందు కూర్చొన్నారు, బొచ్చు కుక్కను పట్టుకొని అయిలయ్య వెనక కూర్చున్నారు.

జీపు వేగంగా పోతున్నది. చాలా హుషా రుగా ఉంది.

బొచ్చు కుక్కకూ హుషారుగా ఉంది. కని పించే చెట్టును, పుట్టను చూస్తూ 'కుయ్‌కుయ్' మని మొరగసాగింది.

అయితే అయిలయ్య కడుపులోని ప్రేగులు మాత్రం కోపంతో మొరుగుతున్నాయి. ఆ మనిషి ప్రేగులై పుట్టినందుకు ఏడుస్తున్నాయి!

'మొలుగు' చేరగానే కదలనని జీపు మొరా యించింది. పెట్రోలు బంకును చూడగానే దానికి ఆకలయినట్టుంది! ఫైవ్ స్టార్ హోటల్‌ను చూసినట్టు దాని ముఖం వెలిగిపోయింది! డ్రైవర్ దిగి దాని కడుపు నింపాడు.

ఆ జీపు నయం! ఈ అయిలయ్య వొట్టి మూర్ఖుడు....అనుకున్నాయి అతని కడుపు లోని ప్రేగులు. ఆ జీపు కడుపులో దూరినా బాగుండేది. ఈ మనిషి కడుపులో చిక్కు కున్నాము అని విచారించాయి!

కృష్ణమూర్తి అత్తగారు కూతుర్ని, అల్లుణ్ని, వాళ్ళ అట్టహాసాన్ని చూసి ఎంతో సంతోషిం చారు. ఆఫీసరు దగ్గర పర్‌మిషన్ తీసుకొని 'మా అత్తగారి ఇల్లుకూడా ఇక్కడే ఉందిసార్ ఒక్కసారి వెళ్ళొస్తా—గంటలో వస్తాసార్.'" అని జీపుతోసహా డ్రైవర్ జారుకున్నాడు.

జీపు తోలుకొచ్చిన అల్లుణ్ని చూసి ఆ డ్రైవర్ అత్తగారూ ఎంతో సంతోషించి ఉంటారు. ఆ వాడంతా తన అల్లుణ్ని, జీపును చూస్తుంటే ఆ అత్తగారింటి ఆనందం ఆకా శాన్ని అందుకొని ఉంటుంది!

అయిలయ్య మాత్రం ఎటూపోక బొచ్చు కుక్కను పట్టుకొని 'దొరగోరి' అత్తగారి మేడ బయటే నిలుచున్నాడు.

కొంచెం సేపటికి లోపలికి రమ్మని బొచ్చు కుక్కకు కబురొచ్చింది.

అయిలయ్యకూ వస్తున్నాయి కబుర్లు.... కడుపులోంచి!

కాని అతడు కదలడు. ఆజ్ఞలు పాటించ డంలో కేసబియాంకాను మించిపోతాడు. అయినా బరువులేంది కదిలి మాత్రం ఏం చేస్తాడు!

అక్కడ ఊరిలో—అయిలయ్య భార్య దుర్గమ్మ "నీ మొగడు పేటకుపోయిండె" అని కనకయ్య చెబితే విని ఏడ్చినంత పనిచేసింది. తనకు చెప్పకుండా భర్త అలా వెళ్ళినందుకు ఆమె చాలా బాధపడింది. కాని పాపం! ఏం చేస్తాడు అయిలయ్య ,ఎమర్జెన్సీ వెంటబెట్టుక పోతుంటె!

ఆ రాత్రి కృష్ణమూర్తి భార్యకు నొప్పులు రావడంతో మెటర్నిటీ హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. నిద్రాహారాలు మాని వాళ్ళు చెప్పిన పనల్లా చేయసాగాడు అయిలయ్య.

'దొరగోరు శానా మంచోరు' అని మరీ మరీ అనిపిస్తున్నది అయిలయ్యకు. తానెంతో అప్పుడు కనుక ఇలాంటి సమయంలో తనను దగ్గరుంచుకున్నారు మరి ఆకలి దప్పుల మాటేమిటి?-అవసరం వచ్చినప్పుడు అవన్నీ



లెక్కచేయొద్దు!

అయిలయ్యకు అంతా అయినవాళ్ళే'

తన భార్య ప్రసవించినప్పుడు మాత్రం ఇంటి దగ్గఅకాదు, అసలు ఊర్లోనే లేడు అయిలయ్య! కృష్ణమూర్తికంటె ముందున్న 'దొరగోడు' సీసాలు తెమ్మంటె తాలూకా బజారుకెళ్ళాడు. ఇంటి దగ్గఅ భార్య పురిటి నొప్పులుపడుతున్నా ఆ 'దొరగోరి' గొంతు నొప్పి మొదట తీర్చాల్సి వచ్చింది. ఇదంతా అయిలయ్య ఆలోచించడంలేదు- అయిలయ్యకు ఈ ఆలోచనరాదు!

రెండు రోజుల తరువాత దొరగారిని, దొర గారి బొచ్చు కుక్కను, ప్యూనును తీసుకొని తాలూకాఫీసు జీపు ఊరికి తిరిగివచ్చింది. వచ్చీ రావడంతోటె "మాంచి కోడి పొలావ్ పట్రా అయిలయ్యా. .." అంటూ దొరగారు నవ్వు తూనే ఆర్డర్ జారీచేశారు. తలూపి ఇంటికి వచ్చాడు అయిలయ్య.

కళ్ళు పీక్కుపోయాయి. ముఖం చిక్కి పోయింది

శరను అలా చూసి దురమ్మ మనసు బావురుమంది.

"దొరగోరికి జల్ది కోడి కూరండుక పోవాలె." అన్నాడు అయిలయ్య వస్తూనే.

"అయితే నువ్వచ్చింది కోడి కూరకా! పెళ్ళాం బిడ్డలను సూడ్డానిక్కాదు! ." అన్లేదు దుర్గమ్మ. ఆ మనిషి తీరు ఆమె కెప్పుడో అర్థమయింది!

ఆర్రూపాయలు అప్పుపెట్టి ఒక మాంచి కోడిని పట్టుకొచ్చాడు అయిలయ్య 'దొర గోరికి' అని చెప్పి భయపెట్టి తీసుకరావచ్చు. కాని అయిలయ్యకు అంతతెలివి, శక్తియుక్తులు లేవు! అందుకే అయిలయ్య కడుపులోని ప్రేగులు దేవున్ని రోజూ తిడుతుంటాయి... ఆ మనిషి కడుపులో పడేసినందుకు!

నెలరోజుల్లోపల కృష్ణమూర్తి భార్య వచ్చే సింది.

"ఏం మునిగిపోయిందని ఇంక తొందరగా వచ్చేసింది!" అనుకున్నాడు కృష్ణమూర్తి.

"సీసా పాలైతే బాబు ఆరోగ్యం చెడిపోతుందేమోనండి ." అందావిడ గారాలు పోతూ భర్తతో.

"అవునూ సీసా పాలెందుకు?" అన్నాడు కృష్ణమూర్తి.

"పొండి మీకేం అర్థంకాదు—" అంది చిఱుకోపం తెచ్చుకుంటూ — అర్థమయింది కృష్ణమూర్తికి—" ఓ అందుకా అవును సీసా పాలుకావాలి—" అన్నాడు.

"అవే వద్దంటున్నాను కొంతకాలం—"

"వద్దంటె ఎలా?"

"ఎవరైనా పాలిచ్చే మనిషిని చూడండి."

తన సొగసులు తరగిపోతాయని ఆమెబెంగ!

* * *

'గుమ్మల గింజలు గుమ్మల్నె ఉండాలె గునుపాల్లెక్క బిడ్డలుండాలె అన్నట్లున్నది ఆమె వ్యవహారం' అనుకున్నది దుర్గమ్మ, భర్త చెప్పిందంతా విని—

"అయితే నన్నేం జేయమంటవయ్యా?" అని అడిగింది. "ఏంటయ్యా నువ్వనేది? నేనియ్యాల్నా ఆ పిల్లగానికి పాలు?"

"ష్. లొల్లి పెట్టకే — దొరగోరి బిడ్డకు పాలిచ్చే అదురుష్టం అందరి కొస్తాదె!" అని ఆమె నోరు మూశాడు అయిలయ్య.

"సంటిది ఏడుస్తాదయ్యా — దానికి సరిపోవయ్యా" అని ఆమె ఎంత చెప్పినా, ఏడ్చినా ప్రయోజనం లేకపోయింది. 'దొరగోరి' దగ్గరికి ఆమెను లాక్కుపోయాడు అయిలయ్య—

కనకయ్య గుడిసె ప్రక్కనే పశువులకు చిన్న పాక ఒకటి ఉంది. ఆ పశువులను కాయడానికి ఒక జీతగాన్ని పెట్టుకున్నాడు. ఆ జీతగాడె వాటి పాలు పితికి అమ్మక వస్తుంటాడు.

వారం రోజుల క్రితమే ఈనిన ఈరయ్య బర్రెను బేరంచేశాడు కనకయ్య. ముట్టెనుంచి తోక దాకా దాన్ని పరీక్షగా చూశాడు.

ఎదురుగా నిల్చున్న దుర్గమ్మను ఆపాద మస్తకం పరిశీలనగా చూశాడు కృష్ణమూర్తి.

బర్రె పొదుగును చేయితో తడిమి చూశాడు కనకయ్య.

చూపుల చేతులతో దుర్గమ్మ రొమ్ములను తడిమి చూస్తున్నాడు కృష్ణమూర్తి.

పరవాలేదు పాలు బాగానే ఇస్తుంది అనుకున్నాడు కనకయ్య.

పరవాలేదు బాగానే ఇస్తుంది అనుకున్నాడు కృష్ణమూర్తి—

బర్రెకు ఒంటిమీద తేళ్ళు, జెర్రులు ప్రాకాయోలేదో తెలియదు కాని ఈగలు, దోమలు మాత్రం ముసిరాయి.

దుర్గమ్మ మాత్రం అక్కడ నిలవలేక ప్రక్కకు పోయింది.

జీతగాన్ని పిలిచి కొత్త బర్రెను, దాని దూడను తీసుకుపోయి పాకలో కట్టేయమని చెప్పాడు కనకయ్య. కొత్త పలుపులు తీసుకొచ్చి వాటి మెడకు తగిలించి తీసుకపోయాడు జీతగాడు,

"ఉంచిపో " అన్నాడు కృష్ణమూర్తి—

"అట్లనే బాంచెను " అని వెళ్ళిపోయాడు అయిలయ్య. దుర్గమ్మకు దుఃఖం ఆగలేదు.పసిదాన్ని వదిలి ఉండలేకపోయింది.

"ఇంకా అక్కన్నే నిలబడ్డవేంది?" ఇలా రా " అంటూ ఆమెను ఇంటి వెనుకకు తీసుకుపోయింది కృష్ణమూర్తి భార్య కుమారి. ఆమె ఎప్పటికీ కుమారిలా ఉండాలని కాబోలు ఆ పేరు పెట్టారు.

పిల్లల్ని కన్నా ఆమె కుమారే మరి!

"బాగా కడుక్కొనిరా " అని దుర్గమ్మను బాత్‌రూంకు పంపించింది కుమారి.

భయం భయంగా ఉంది దుర్గమ్మకు. ఏడుపు వస్తోంది. పాలిచ్చి తొందరగా అక్కణ్నుంచి పారిపోవాలని ఉందామెకు—

ఆమె బట్టలుకూడా మార్పించింది కుమారి.

రెండుమూడు తువ్వాళ్ళు, గుడ్డలు రొమ్ముల క్రింద పరచి పాలివ్వడానికి పిల్లవాణ్ని అందించింది. ప్రక్కనే కుర్చీవేసుకొని కూర్చుంది.

దుర్గమ్మ వంచిన తల ఎత్తకుండా నేలమీద కూర్చుంది పిల్లవానికి పాలిస్తూ—ఆ పాలు



త్రాగి ఆమె ఒడిలోనే నిద్రపోయాడు. ... చల్లని ఒడిలో భేదాలు తెలియని పసివాడు!

ముఖం చిట్లించుకొని కొడుకును దుర్గమ్మ ఒడిలోంచి తీసుకొని స్పాంజ్ పరుపుమీద పడుకోబెట్టింది కుమారి.

ఇక వెళ్తానన్నట్లు లేచి నిలబడింది దుర్గమ్మ.

"పోయిరానా అమ్మగోరూ.. " అని అడిగింది.

"పోతవా! ఎక్కడికే?" ఆశ్చర్యంగా అడిగింది కుమారి.

"ఇంటికాడ సంటిది ఏడుత్తాందిగావచ్చు." దీనంగా ముఖంపెట్టి అంది దుర్గమ్మ.

"ఏడి సైవాడు లేడె ఇంటికాడ? నువ్విక్కడ్నే ఉండాలె"

తలమీద పిడుగుపడినట్లయింది దుర్గమ్మకు.

"సంటిది పాలకేడు త్తదిగాదు బాంచెను--" అంది గొంతు పెగుల్చుకొని—

"ఆహాఁ ఆ పోరికి పాలిచ్చి ఆ ఎంగిలి పాలు మా బాబు కిస్తావు!—వీల్లేదు. నువ్విక్కడ్నుంచి కదలొద్దు—వాడే ఏ పాలోపోసి చూసుకుంటడు నువ్విక్కడ్నే ఉండు. ."

కాళ్ళ క్రింది భూమి కదిలిపోతున్నట్లు, ఆకాశం విరిగి మీద పడుతున్నట్లున్నది—దుర్గమ్మ గుండె దడదడ కొట్టుకోసాగింది.

నామాలు పెట్టుకున్న వాళ్ళంతా భక్తులు కాదు.

కన్న వాళ్ళంతా తల్లులుకారు!

కుమారి తల్లి కాదు.

అందుకే ఆమెకు దుర్గమ్మ 'తల్లి మనసు' అర్థం కాలేదు.

అలా కృష్ణమూర్తి ఇంటి వెనక భాగంలో కట్టివేయబడింది దుర్గమ్మ.

అటువైపు భర్త రాకుండా చాలా కట్టుదిట్టం చేసింది కుమారి—

గడ్డివేసే విషయంలో పాలిచ్చే బర్రెలకు, పాలివ్వని బర్రెలకు వేరువేరు పాలసీలుంటాయి. అవి కనకయ్య జీతగానికి బాగా నేర్పాడు. పాలిచ్చే బర్రెలకూడా పాలు పితకడానికి ముందు వేసే గడ్డికి, మామూలు సమయాలలో వేసే గడ్డికి చాలా భేదం ఉంటుంది. పరిమాణంలోనూ, పచ్చదనంలోనూ ఆ భేదం ఉంటుంది.

పాలు పితకడానికి ముందు———పచ్చిగడ్డితోపాటు పల్లిపిండి తవుడు.. .రుచికరమైన, పుష్టికరమైన ఆహారం ముందుపెట్టి చెంబులు, సర్వాలు పట్టుకొని వెనక కూర్చుంటారు

కనకయ్య, జీతగాడు.

దుర్గమ్మకు వి స్తరి నిండా అన్నం పెట్టుక వచ్చి ఇచ్చింది కుమారి. కాని. . ఒక ముద్ద కూడా తినలేకపోయింది దుర్గమ్మ. పసిది కళ్ళల్లో మెదిలి ఆమె గుండె చెఱువై పోయింది.

ఆమెకు రెక్కలుంటే ఆ క్షణంలో అక్కణ్నుంచి ఎగిరిపోయేది. బిడ్డను అక్కున చేర్చుకొని తనివితీరా పాలిచ్చేది.

ఆమెకు రెక్కలుంటే అవి కూడా కట్టి వేయబడేవి, కొట్టివేయబడేవి అన్నా ఆశ్చర్యం లేదు!

ఆ అన్నం తినలేక 'అమ్మగోరు' చూడనప్పుడు దొడ్డి గుమ్మం తలుపులుతీసి పెంటలో వేసి చెత్త కప్పింది దుర్గమ్మ.

ఆ సాయంత్రం——

కనకయ్య పశువులపాక వైపు చూస్తూ దొడ్డి గుమ్మాని కానుకొని నిలబడింది దుర్గమ్మ.

దూడను ఒక గుంజకు కట్టేసి బర్రెపాలు పితకడానికి కూర్చున్నాడు కనకయ్య జీతగాడు. ఆ బర్రె ముందు దానా ఉంది. అయితే దాని చూపులన్నీ దూరంగా కట్టివేయబడిన తన దూడమీదే ఉన్నాయి. పాలు బాగా రావాలని పొదుగును, దాని ప్రక్కలను నిమురుతున్నాడు జీతగాడు.

పొదుగును కడిగి మోకాళ్ళ మధ్య సర్వ పెట్టుకొని రెండు చేతులతో పితుకుతున్నాడు. ధారలుగా పాలు సర్వలో పడుతున్నాయి.

దూడ దీనంగా చూస్తున్నది.

మౌనంగా ఏడుస్తున్నది.

తన కూతురు గుర్తుకువచ్చి మనసు దేవినట్లయింది దుర్గమ్మకు——ఆమెకు దుఃఖం పొంగి వచ్చింది..

ఆరాత్రి——ఇంటి వెనక గదిలో దుర్గమ్మ పడుకోవడానికి ఒక చాప, ఒక చిరిగిన దుప్పటి ఇచ్చింది కుమారి.

దుర్గమ్మకు నిద్రపట్టలేదు. దీనంగా చూస్తున్న దూడ....తన కూతురు కళ్ళల్లో మెదిలి ఆమె మనసంతా నీరై పోయింది. కడుపు తరుక్కుపోయింది.

ఆమె అక్కడ ఉండలేకపోయింది. పక్కమీదినుంచి లేచింది. మెల్లగా తలుపులు తీసి బయటికి వచ్చింది.

ఆమె అడుగులు తడబడుతున్నాయి.

దొడ్డి గుమ్మంవైపు నడిచింది. ఆమె గుండె భయంగా, వేగంగా కొట్టుకోసాగింది. అంతలో లోపల్నించి అబ్బాయి ఏడుపు విని పించింది. లైటు వెలిగింది. గబుక్కున వెనక్కు తిరిగి గదిలో దూరి తలుపేసుకొంది.

కొంచెం సేపటికి కుమారి ఆ గది తలుపులు తట్టింది.

ఆ మరునాడు ఉదయం —— చంటిదాన్ని తీసుకొని అయిలయ్య వచ్చాడు. ప్రాణాలు లేచి వచ్చినట్లయింది దుర్గమ్మకు. గబగబా ఉరికొచ్చి కూతురునందుకొని గుండెలకు హత్తుకొంది ఆర్తిగా. తల్లి స్పర్శ గుర్తించి చంటిది ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఏడ్వసాగింది. కొంగును ప్రక్కకు తొలగించ సాగింది. దుర్గమ్మ ఆగలేక రొమ్ముతీసి బిడ్డ నోట్లో పెట్టబోయింది——

'అమ్మగోరు' "ఏందె అది?' అంది అమ్మ వారిలా ఉరిమి చూస్తూ——

దుర్గమ్మ మనసు విలవిల లాడిపోయింది.

దీనంగా భర్త ముఖంలోకి చూసింది.

తలవంచుకున్నాడు అయిలయ్య.

"తీసుకపోరా దాన్ని——అయ్యగారిని పైసలడుక్కొని ఏ పాలో కొనిపోయి పో .. చస్తదా . ఏం చావది " విసురుగా అంది.

అయిలయ్య భార్య చేతుల్లోంచి కూతురిని లాక్కొని గబగబా అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు.

గుడ్ల నీరు కుక్కుకొంటూ అలాగే నిలుచుండిపోయింది దుర్గమ్మ——

"ఇంకా నిలుచున్న వేందె? స్నానం చెయిపో——బాబుకు పాలిచ్చేదానివి శుచి శుభ్రంగా ఉండక్కర్లా?" అంది వాళ్ళబ్బాయికి పాలివ్వడానికే దుర్గమ్మ పుట్టినట్లు——

దుర్గమ్మ స్నానంచేసి అబ్బాయికి పాలి

స్తోంది.

కుమారి స్నానం చేస్తున్నది—కృష్ణమూర్తి వచ్చాడు.

పాలిస్తున్న దుర్గమ్మను చూస్తూ నిల్చున్నాడు—కంగారుగా. గబగబా పయిటతీసి నిండా కప్పుకొంది దుర్గమ్మ. అప్పటికే.ఆమె వక్ష సంపద అతని కళ్ళబడింది. నవ్వి—ఆ నవ్వును చూసే దొర మంచోడు అనుకుంటున్నాడు అయిలయ్య- "అంతంత లావున్నయి. ఏం పెట్టి లావు చేసుకున్నవే కుడుకలు బాగా తిన్నావు?" అన్నాడు.

ఆ మాటలు వినలేకపోయింది.

పరాయి మగాడు అలా మాట్లాడుతుంటె ఏ ఆడది సహిస్తుంది?

కాని దుర్గమ్మలు సహిస్తారు. పేదరికం వాళ్ళకు సహనాన్ని నేర్పుతుంది. పేదరికం వాళ్ళకు నేర్పేవాటిలో సహనం ఒకటి. ఈ అహంకారం ఇంకా బ్రతికి ఉండటానికి కారణం ఆ సహనమే!—

"పోరనికి పాలివ్వకున్నా మా దానివి ఇంతింత లేవేందె!" అంటూ దగ్గఱగా వస్తున్నాడు—

అలా అంటున్న నాలుకను కసుక్కున కోసేయాలనిపించింది దుర్గమ్మకు—

"నువ్వు బాగున్నావు పెళ్ళిచేసుకుంటా" అన్నందుకే అన్నదమ్ము లిద్దరూ కలిసి శూర్పణఖ ముక్కు చెవులు కోసేశారట!—

పరస్త్రీని పట్టుకొని నీ రొమ్ములు బాగున్నాయనే ఈ మనిషి ముక్కు చెవులెవరూ ముట్టుకోరు!

పైగా వాటికి రోజూ మొక్కుతుంటారు?

ఆ మధ్యాహ్నం భర్తవస్తే మెల్లగా అంది దుర్గమ్మ—"నన్ను తీస్కపోయ్యా ఈడ ఉండలేను" అని.

"ఎందుకే. అమ్మగోరూ, దొర శానా మంచోరు—ఉండు." అన్నాడు అయిలయ్య.

ఈ మొద్దు మనిషికెలా చెప్పాలి అని మనసులో భోరున ఏడ్చింది దుర్గమ్మ.

"ఏందిరా పెళ్ళాన్ని చూడకుండా ఉండ బుద్ధి అయితలేదా?" అంది వెటకారంగా వాళ్లు మాట్లాడు కొంటుండంచూసి కుమారి.

తల [ఉంటె!] తీసేసినంత పనయింది

(వి) చిత్ర విజ్ఞానం



స్త్రీలో ప్రతి సారీ బహిష్టు కాలం ఆసన్నమయే సమయంలో ఆవిడ మానసిక ప్రవర్తన మామూలుగా వుండక దానికి వ్యతిరేకంగా వుంటుంది. స్త్రీ నేరస్థుల మీద జరిగిన పరిశోధనలలో వారు తమ బహిష్టు కాలానికి అతి దగ్గరగా ఉన్న రోజుల్లోనే నేరాలు చేశారని రుజు వయింది. ఇతర పరిశోధనల్లో పెక్కు మంది స్త్రీలు ఆత్మహత్యలు ఇదే కాలంలో చేసుకున్నారని కూడ తెలిసింది. స్త్రీ దేహంలోని కొన్ని "స్త్రీ హార్మోనులే" యీ అసాధారణ మానసిక ప్రవర్తనకు కారణాలు!

అయిలయ్యకు "ఏం లేదమ్మగోరూ. మంచిగ ఉండని చెబుతాన" అంటూ వెళ్ళిపోయాడు- పేగుల్లాగే దుర్గమ్మ ఆ మనిషిని తిట్టుకుంది.

ఎర్రెర్రగా నల్లగా . చండూరం ముక్కలాగున్న దూడ బక్క చిక్కిపోయి ఎముకల గూడులా అయిపోయింది. దాని డొక్క ఎండిపోయింది. కనకయ్య చెంబులు, సర్వలు పాలతో నిండిపోతున్నాయి.

కనకయ్య జేబులు డబ్బుతో నిండి పోతున్నాయి.

కనకయ్య భార్య మెడ బంగారంతో నిండి పోతున్నది!—

ఒకరోజు సాయంకాలం—

దీనంగా తల్లికేసి చూస్తున్నది దూరంగా గుంజకు కట్టివేయబడిన దూడ. బక్కచిక్కిన ఆ దూడను జాలిగాచూస్తూ నిలుచుంది దుర్గమ్మ.

తనముందు ఎరగా పెట్టిన దానాను బర్రె ముట్టుకోవడంలేదు. మాటిమాటికి వెనక్కి తిరిగి దూడవైపు చూస్తున్నది. 'అంబా . బా .'' అని అరుస్తున్నది. జీతగాడు ముందుకు వస్తే కొమ్ములతో కుమ్మబోయింది. పొదుగును కడగబోతె తన్నబోయింది.

పాపం! దూడకు 'అంబా' అని అరిచే శక్తైనా లేదు! ఆదూడలో, తన కూతురు కనిపించి గుండెలవిసి పోతున్నాయి దుర్గమ్మకు.

జీతగాడు అటు తిరిగాడు. ఇటు తిరిగాడు. మరింత మేత, దానా తెచ్చివేశాడు. కాని బర్రె ఏ మాత్రం సందివ్వడంలేదు. పాలు పితక నివ్వడంలేదు—దగ్గఱికిపోతె కుమ్మబోతున్నది. పలుపును, గుంజను అటూ ఇటూ లాగుతున్నది.

చివరికి ఆ పలుపును తెంపుకొని గబగబా దూడ దగ్గఱికి పరుగెత్తుక వచ్చింది. ఆత్రంగా దూడ తల్లి పొదుగును నోట్లో కఱచుకొని గుటగుట పాలు త్రాగసాగింది. ఆ తల్లి కళ్ళు తృప్తిగా వెలిగిపోతున్నాయి. ముట్టితో ప్రేమగా బిడ్డను నిమురసాగింది.

వాటిని చూస్తుంటె ఆనందంతో దుర్గమ్మ కళ్ళు చెమర్చాయి.

రాత్రంతా ఆమెకు నిద్రపట్టలేదు—ఆమె కనుల ముందు పలుపు తెంచుకొన్న గేదె- ఆత్రంగా ఆనందంగా పాలు త్రాగుతున్న దూడ కదిలాయి

అక్కణ్నుంచి ఆమెకు పారిపోవాలని ఉంది.

అక్కణ్నుంచి ఆమెకు వెళ్ళిపోవాలని ఉంది.

పాపం పసికందు పాలకేడిస్తే ఎలా? తల్లికి పాలున్నాయి. ఇస్తుంది.

భర్త ఉద్యోగం? పోతుందా పోనీ! ఇది కాకపోతే మరొకటి ఏ కూలైనా చేసుకొని బ్రతకవచ్చు- అసలిదీ ఒక బ్రతుకేనా?

భర్త కోప్పడి తిరిగి తీసుకొస్తే? చచ్చినా రాదు. పిల్లను తీసుకొని వేరే ఉండటానికైనా ఇష్టపడుతుందిగాని మళ్ళీరాదు!

ఆమె ఇక ఒక్క క్షణంకూడా అక్కడ ఉండలేకపోయింది—

తలుపులు తీసుకొని బయటికి వచ్చింది.

ఆమె అడుగులిప్పుడు తడబడడంలేదు.

అప్పుడప్పుడే చీకట్లు తొలగిపోతున్నాయి. తూర్పు సూర్యుణ్ణి కనబోతున్నది! □

మీరు చదివారా!

ప్రమోద
పిల్లల మాస పత్రిక

వెల : రూ. 1-25